



సుస్మితా రమణమూర్తి

# కౌగిలింపిట్టలు



మే ఐ హెల్ప్ యూ కేబిన్ కి ఎదురుగా స్టేషన్ రూఫు నుంచి వైర్లలో వ్రేలాడదీయబడిన గడియారంలోని ముల్లులకు జీవంలేక ఎప్పట్నించో పదకొండు గంటలే చూపిస్తూంది.. గడియారంకి ఎదురుగా ఉన్న సిమెంటు బెంచిపై ఒక పాతికేళ్ళ అమ్మడు కూర్చుంది.

ఆ అమ్మడు శోభాయమానంగా ఉంది. అసలే ఎరుపురంగు శరీరం. దానికి తోడు కట్టుకున్నది. ఎర్రరంగు పట్టు చీరేమో మరింత రంగుగా కనిపిస్తూంది. మనిషి నీట్‌గా—నాజుగ్గా ఉన్నా తన వేషధారణ మాత్రం సింపుల్‌గాలేదు. పాతకాలం మనిషిలా మెడలో నాలుగు రకాల వస్తువులు— ఒక చేతికి అరడజను బంగారు గాజులు— మరో చేతిక బంగారపు చెయిన్‌తో బంధింపబడిన ఫారెన్ వాచీ—చెవులకి ముత్యాలు పొదిగిన జుంకాలు—. . . .ఎడం చేతి చిటికెనవేలికి ప్రక్క వేలికి ఎర్రరాళ్ళ ఉంగరాలతో ప్లాట్‌ఫాం మీద జనాలందరికీ ప్రత్యేకంగా— ఒక వింతగా కనిపిస్తూందామె.

ఒరిజినల్‌గా ఆమె మూడు అంగుళాల ఎత్తు— మూడు అంగుళాలు తాను ధరించిన ఎర్ర రంగు ఎత్తు మడమల చెప్పులవి. నాజుగ్గా పెంచుకున్న ఎర్ర రంగు గోళ్ళు — కనుదోయికి ఇంపు కలిగించే కనుముక్కు తీరు . . . రూప లావణ్యాలు నిజంగా తన సొత్తు. ఒక సారి చూస్తే కనీసం మరో రెండు సార్లయినా చూడాలనిపించే ముద్దు ముఖం తనది.

అంత అందమైన అపరంజి బొమ్మ అలా ప్లాట్‌ఫాం మీద సిమెంటు బెంచీపై కూర్చుని అటూ ఇటూ చక్రాల్లాంటి కళ్ళను మరింత అందంగా తిప్పుతూ పరిసరాలను వీక్షిస్తూంటే ఏ మగాడికి ఆనందదాయకం కాదు? షష్టి పూర్తి చేసుకున్న యువకుల్ని కూడా గిలిగింతలు పెట్టించేటంత వయ్యారాలు తన సొత్తయితే—ప్రభాకర్ లాంటి అర్ధషష్టి పూర్తిగాడి గుండెలో ఏదో కలకలం నరాల్లో చెప్పలేని బాధ — ఒళ్ళంతా గాల్లో తేలి పోతున్నంత పరవశం ... అలా ఒళ్ళంతా తిమ్మిరి తిమ్మిరిగా ఉండటంలో ఆశ్చర్యం లేదనుకుంటాను?

ప్రభాకర్ రచయిత. అప్పుడప్పుడువీలున్నప్పుడల్లా ఇలా ప్లాట్‌ఫాం సందర్శనం గావిస్తూ తన కథల కర్మాగారానికి అవసరమైన ముడిసరకును సేకరిస్తుంటాడు. అలాంటి అన్వేషణలో—వేటలో ఉన్న ప్రభాకర్ దృష్టి ముద్దు ముద్దుగా కళకళలాడుతున్న ఆ ఎర్రమ్మడు ఆకర్షించింది.

కొన్ని నిముషాలు సిమెంట్ బెంచి మీద కూర్చుంటూ—మరి కొన్ని నిముషాలు ఎంతో బిజీగా అర్రెంగా మనుషుల మధ్య నుంచి మెరుపు తీగలా దూసుకుపోతూ ప్లాట్‌ఫాం ఈ చివరి నుంచి ఆ చివరకు పచార్లు చేస్తూంది. అప్పుడప్పుడు తన వానిటీ బేగ్‌ని తెరచి లోపలకు చూస్తూంది. మళ్ళీ నిరాశగా బెంచీమీద కూర్చుంటూ నిశితంగా ప్లాట్‌ఫాం మీదున్న జనాన్ని, గేట్లోంచి బయటకు వెళ్ళి పోతున్న వాళ్ళను చూస్తూంది.

తను ఎవర్నో రిసీవ్ చేసుకోడానికి వచ్చిఉంటుంది. బహుశా వాళ్ళు ఈ బండికి వచ్చి ఉండరు. వస్తే ఈ పాటికి కనిపించరా . . . . అందుకేనేమో ఈ బంగారు లేడి కళ్ళలో నైరాశ్యపు భావాలు దోబూచులాడుతున్నాయ్?

మెడలో నల్ల పూసల దండ కనిపిస్తుందే! ?. పెళ్ళయిన బాపతన్న మాట. ఇంకా పసుపు పాంపులతో పిట్ట పిటపిట లాడుతూందంటే బహుశా ఈ మధ్యే పెళ్ళయ్యుంటుంది. అవకాశం చూసి పరిచయం చేసుకుంటే చాలు. ఆ తరవాత తన వాక్చాతుర్యంతో ఆమెను ఆకర్షించ వచ్చు. ఒక నాలు గడుగులు

# ఇమామి వారి అతి ప్రత్యేకమైన ఓ కానుక
















## ఇమామి
## కోల్డ్ క్రీమ్ ఆల్మండ్ ఆయిల్‌తో తయారు చేయబడినది

మీ చర్మ పోషణకు కావలసినది, యింతకు పూర్వం మీకు తెలియనిది...ఆల్మండ్ ఆయిల్. అది ఒక్క ఇమామి కోల్డ్ క్రీమ్‌లోనే వుంది.

అద్వితీయమైన యీ పేరుపొందిన ఆల్మండ్‌గల క్రీమ్ చర్మంలోనున్న తేమతో బాగా కలిసిపోయి, శీతకాలపు పొడిగాలి మీ చర్మానికి తగలకుండా, అడ్డుగోడవలె వుండి కాపాడుతుంది. అలా చేయడం వల్లనే మీ చర్మం నిగనిగలాడుతూ మెరుస్తుంటుంది.

**కెమ్‌కో కెమికల్స్**
పోస్ట్ బాక్స్ నం. 6912, కలకత్తా-700 007

adlink/dps/kc-4 TEL

# ఇమామి మీ అందాన్ని తీర్చి దిద్దుతుంది


ముందు కెయ్యొచ్చు. లైసెన్సు హోల్డరే కనక అటో ఇటో అయినా మరేం ఫరవాలేదు.

అంత బాగానే ఉంది. పరిచయం చేసుకునే దెలా? ఇంచుమించు చుట్టుపక్కల వాళ్ళ చూపులన్నీ తన మీదే ఉన్నాయే. ఇంతమందిలో ఆమె పరిచయం కోసం ప్రాకులాడ్డం బాగుంటుందా? వ్యవహారం లేవైనా బెడిసి కొడితే నలుగుర్లోను అభాసు కాదూ? వెధవ లందరి దృష్టి ఆమె పైనే పడాలా?

ఆయేదేదో అవుతుంది. ప్రయత్నించి చూద్దాం. రంగంలోకి దిగిన తరవాత అనుకున్నది సజావుగా జరుగుతుంది అన్న నమ్మకం కలిగితే సరేసరి. లేకుంటే అప్పుడే తోక ముడిచేయొచ్చు.

బెంచీ మీద తనొక్కతేగా కూర్చుంది. న్యూస్ పేపరు తీసుకుని సీరియస్‌గా పక్కన కూర్చుని చదివినట్టు నటిస్తూ అవకాశం కోసం గమనిస్తే సరి. తనెలాగూ బోరు ఫీలవుతోంది. ఫ్రీగా వస్తే న్యూస్ పేపర్లు, కథల పుస్తకాలు చదవడం చాలా మందికి ఒక విధమైన అంటువ్యాధి. పైగా కాలక్షేపం కూడాను.

"ప్రయత్నిద్దాం. కష్టేఫలి, అనుభవంతోబాటు కథకి సరుకుకూడా దొరకొచ్చు.

అలా ఆలోచనల్లో కొట్టుమిట్టాడిన ప్రభాకర్ తన హేండ్ బాగ్ లోంచి పేపరు తీసి ఆమె పక్క కూర్చుని చదువుతున్నట్లు నటిస్తూ ఆమె తనను పేపరు అడక్క పోతుందా? ఆ నెపంతో పరిచయం చేసుకోలేకపోతానా? అన్న ఆశతో అవకాశం కోసం ఎదురు చూడసాగాడు.

ఆ అమ్మడి చర్యలో మాత్రం తేడా లేదు.

చుట్టు పక్కల జనాల చూపుల్లోకూడా మార్పు లేదు.

ఎన్నో జతల కళ్ళు ఆమె వంపు సొంపుల్ని ఆశగా తనివితీరా తిలకిస్తూ తామొచ్చిన పనికూడా మరిచి కాలక్షేపం చేయసాగాయ్. మరి కొందరు ఆమె నగల వేపు, అలంకరణ తీరుని గుచ్చి గుచ్చి పరికించసాగారు. అలా ఆమెను వింతగా బోనులోని మృగంలా ప్రత్యేకించి చూడ్డంలో ఆమె ఎంతో అసహనంగా ఇబ్బంది ఫీలవుతోందని జనాలు గ్రహించినా అదేవీ ఖాతరు చేసే స్థితిలో లేరు వాళ్ళు.

మరోసారి ఆమె వానిటీ బాగ్ తెరిచి లోపలికి చూసి దిగ్గున తలెత్తి ఎదురుగుండా పోతున్న ఒక మనిషి వైపు పరిశీలనగా చూస్తూ నిరాశగా 'చ్' అనుకుంది.

అలాదిగాలువేడులా తన కుడివేపుకి తిరిగి వంతలో ఆమె దృష్టిలో ప్రభాకర్ చోటు చేసుకున్నాడు.

కొన్ని క్షణాలు తదేకంగా తన వేపు చూస్తూ, "హల్లో ప్రభా! అకాల దర్శనం? బాగున్నావా?" అంది.

అనుకోని ఈ సంఘటనకి ప్రభాకర్ ముఖం ప్రశ్నార్థకంలా మారింది.

తనను బాగా తెలుసున్నవాళ్ళే అంత చనువుగా, ఆత్మీయంగా, ప్రేమగా ఏయ్, ప్రభా అని పిలుస్తారే తప్ప—ఇలా ముక్కు ముఖం తెలీని ఒక స్త్రీ ఎలా పిలువ గలుగుతోంది!? . . . .

తన పేరు ఈమెకు ఎలా తెలుసు?

ఈమెతో తనకు పూర్వాశ్రమంలో ఎక్కడో పరిచ

యం ఉండి ఉండాలి. లేకుంటే అంత ఆత్మీయంగా ఎందుకు పిలుస్తుంది.

ఎవరు చెప్మా ఈమె??? . . .గుర్తుకు రావటం లేదు!? . . . . తెలీనట్లు తెల్లమొహం వేస్తే తనను అదోలా చూడదూ? తన జ్ఞాపకశక్తిని తక్కువగా అంచనా వేయదూ? తెలిసినట్లే—గుర్తున్నట్లే నటిస్తూ ఈనతో పరిచయం ఎప్పుడు ఎలా కలిగింది?—అన్న విషయం గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించాలి.

"ఏమిటి ప్రభా? అలా బెల్లం కొట్టిన రాయిలా అయిపోయావ్? కొంపదీసి నన్ను మరచిపోలేదు కదా?" నవ్వుతూ అందామె.

ప్రభాకర్ ఆలోచనల నిచ్చెన మీనుంచి గభాల్న దిగిపోయాడు. "అబ్బే! అదేమీ లేదు. మనం కలుసుకుని చాలా కాలమైంది కదా? అందుకే కాస్త . . . ."

"అవునవును చాలా కాలమైంది. ఇంతకీ ఆ బాంకులోనే చేస్తున్నావా?"

"ఆ. ఇంకా ఆ బాంకులోనే కేషియర్‌గా ఉంటున్నాను."

బహుశా ఈమె మా బాంకుకొచ్చి మరయుండొచ్చు. ఎంత బాంకు కస్టమరైతే మాత్రం! ? . . . ప్రభా!—అని పిలిచే పరిచయం ఎలా ఉంటుంది? . . ఆమె అంత ఫ్రీగా మాట్లాడేస్తుంటే తనెవరో ఏమిటో ఇంకా గుర్తుకొచ్చి చావటం లేదే? ఎలా?? . . . .ఈ మధ్య మరీ బుర్రలో మట్టి పేరుకుపోతోంది— అనుకుంటూ నెత్తిమీద అనుకోకుండా ఒక దెబ్బ వేసుకున్నాటు ప్రభాకర్.

"ఏమిటి! అలా బుర్ర బాదుకుంటున్నావ్!? నేనెవర్నో ఇప్పటికీ నీకు గుర్తు రావటం లేదన్నమాట? మరిక బుర్ర బద్దలు కొట్టుకోకు. నేను ఉషను! మానాన్నగారు రిటైర్డరు తహశీల్దారు హనుమంత రావుగారు. ఇప్పటికైనా గుర్తు వచ్చిందా?" తెరలు తెరలుగా నవ్వుతూ పరిసరాలను తీక్షణంగా వీక్షిస్తూ అందామె.

అప్పటికీ ప్రభాకర్ బుర్రలో లైటు వెలగలేదు.

"ఓహో నీవు ఉషవా! ఇప్పుడు గుర్తొచ్చింది. బావున్నావా? మీ వాళ్ళంతా కులాసానా?"మనసులోని ఆశ్చర్యాన్ని—తత్తరపాటుని కప్పిపుచ్చుతూ—చిరునవ్వుని ముఖానికి అతికించుకుంటూ అన్నాడు ప్రభాకర్— ఒక వైపు తీవ్రంగా ఉషట! ఎవరీ ఉష?—అన్న విషయంపై ఆలోచిస్తూ—మదన పడుతూ.

"హమ్మయ్య!అయ్యగార్కి ఇప్పుడుగుర్తొచ్చానన్న మాట! బతికించావ్ బాబూ! లేకుంటే ఇంకా ఎంత వాగాల్సొచ్చేదో నాకు! ఏమిటలా మూగాడిలా దిక్కులు చూస్తున్నావ్? ఎంతో కాలమైంది కదా మనం కలుసుకుని! వింతలు—విశేషాలు . . . .అంటే శుభకార్యాలు గట్రా ఎన్నో ఈ మధ్య కాలంలో జరుగుతుంటాయి కదా? ఆ కబుర్లేమైనా చెప్పరాదూ?

'నీవు నన్ను పిలవకుండా ఎలా పెళ్ళి చేసుకున్నావో అలానే అనుకోకుండా నా పెళ్ళి మూడేళ్ళ క్రితం నీలాంటి ముద్దుగుమ్మతో జరిగిపోయింది.' ఉష మెడలో నల్లపూసల దండలో తన దృష్టి చిక్కుపడగా నవ్వుతూ అన్నాడు ప్రభాకర్.


ఓహ్ . ఇప్పుడు ప్రభ మంటి మాటకారయ్యాడే ఈ పూరునుంచి ఆ పూరికి ఎంత దూరమో ఆ పూరునుంచీ పూరికీ అంతేదూరం కదా! నా పెళ్ళి కంటే నీ పెళ్ళి ముందే జరిగింది. నీవు నాడునిక్కని గుర్తించనప్పుడు నేనేం తక్కువదాన్ననుకున్నావా? నిన్ను ప్రత్యేకించి పిలవడానికి?" ఉష.

ఆమె మాటలకి ప్రభ చిరునవ్వునవ్వి పూరుకున్నాడు. బహుశా ఈ ఉష శ్రీపతి చెల్లెలై ఉంటుంది. వాడికి, ఈమెకూ చాలా దగ్గర పోలికలు కనిపిస్తున్నాయ్. మరి వాడు హైదరాబాద్‌లో ఉన్నాడే? ఈ విడేమిటిఈ పూర్లో ఉంది? బహుశా అత్తవారిది ఈ పూరై ఉండొచ్చు. లేకుంటే ఈమె ఇక్కడెందుకుంటుంది? శ్రీపతికి మరో చెల్లెలుకూడా ఉండాలే?. . .

గాలు దొరికిం తరవాత ఒకరు హైదరాబాద్‌కు మరొకరు ఈ పూరికి విసిరి వేయబడిన వాళ్ళు.

"ప్రభా! మరి చెప్పుకో దగ్గ సంగతు లేవీ లేవా?" ఉష.

"ఎందుకు లేవు? ఇప్పటికి నాకో వంశోద్ధారకుడున్నాడు. రేపో మాపో స్లిప్పో మైనప్పో విడుదలకు సిద్ధంగా ఉంది. ఆ తరవాత గవర్నమెంటు వారి ఆదేశంకి ఇద్దరం నిర్ణయం ఎప్పుడో తీసేసుకున్నాం. సుధ పెళ్ళి ఏ దశలో ఉందో మా చెల్లెలు సునంద పెళ్ళి వ్యవహారంకూడా అలానే ఉంది. దాని నెత్తి మీద నాలు గక్షింతలు వేసేస్తే మా అమ్మ, నాన్నలతో బాటు నేనూ తేలిగ్గా వూపిరి పీల్చుకో గలిగే అవకాశం ఉంటుంది."




"ఏమిటి మహానుభావా! మళ్ళీఆలోచనల్లో పడ్డావ్ అంటూ వానిటీ బాగ్‌లోకి తన చూపుల్ని పోనిచ్చి మళ్ళీ ప్లాట్ ఫామ్ మీదున్న జనాల్ని చూడసాగిందామె.

"శ్రీపతి సిస్టర్‌వి కదూ నువ్వు? మరి నీ తరవాత సుధకి పెళ్ళయిందా?" ప్రభాకర్.

"హమ్మయ్య. ఫరవాలేదు. నీ బుర్ర పని చేస్తోంది. మా అన్నతోపాటు మేమూ గుర్తొచ్చాం. చాలా సంతోషం. సుధ కింకా పెళ్ళికాలేదు. సంబంధాల వేటలో ఉన్నాం." ఉష.

ఈసారి ప్రభ ఆమె మాటలకి సంతృప్తి పడ్డాడు. క్లిష్టమైన పజిల్ సొల్యూషన్‌కి క్లూ దొరికినంత సంబర పడ్డాడు. ఉష శ్రీపతి సిస్టరన్న సంగతి తన బుర్రకి తట్టినందుకు తేలిగ్గా సంతోషంగా వూపిరి పీల్చుకున్నాడు.

ప్రభాకర్ శ్రీపతి చదువుకున్న రోజుల్లోను ఒకప్పుడు ఉద్యోగాల వేట సాగిస్తున్న కాలంలోనూ ముఖ పరిచయం 'హలో' అంటే 'హల్లో' అని పలకరించుకునే పాటి స్నేహంకలిగినవాళ్ళు. ఉద్యో.

"చూడు ప్రభా! ఈ జీవితగమనంఉంది చూశావూ భలే విచిత్రం. ఒకప్పుడు మీ వాళ్ళకు నీ ఉద్యోగం తరవాత నీ పెళ్ళి అవాలనే ఆత్రం. ఇప్పుడు సునంద పెళ్ళి ఇంకా అవలేదే అన్న తాపత్రయం, భయం, బెంగ. అది కాస్త అయిపోతే ఆ తరవాత నీ పిల్లల చదువులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు. వగైరా వగైరాలు. ఆ తరవాత తరవాత నీ పిల్లల పిల్లల గురించి మళ్ళీ పాత కధే పునరావృత్తం అవుతుంది. అవునా?"

"భలే గమ్మత్తుగా మాట్లాడేస్తున్నావే!? ఈ మధ్యేమైనా కలం పట్టావేంటి?" జోకు పేల్చినట్లు నవ్వుతూ ప్రభ.

"కలం పట్టడ మంటే!? ... " ఆశ్చర్యంగా ఉష.

"కలం పట్టడ మంటే—కథలు, కాకరకాయలూ అంటూ కాగితాల్ని నలుపు చేస్తున్నావా?—అని."

"పోదూ! నా లాంటి వాళ్ళకేం చాతనవుతుంది? కథలు కాకరకాయల వ్యవహారం మీలాంటి వారికే చెల్లుతుంది."

"అవునట్టు ఈ మధ్య నా కథ లేమైనా చదివావా?" ఆసక్తిగా ప్రభ.

"ఆ మధ్యెప్పుడో నీ కథలు చదివినట్లే గుర్తు. పేరు చూసి నువ్వే అయ్యుంటావ నుకున్నాను. ఆ రోజుల్లో నీ కథలు గోడకి కొట్టిన బంతుల్లా తిరిగొచ్చేస్తుంటే నేను — మా సుధ— అన్నయ్య వేళాకోళం చేసేవాళ్ళం గుర్తుందా నీకు? ఏమైతేనేం? మొత్తానికి పట్టు వదలని విక్రమార్కునిలా రచయితగా నీ స్థానాన్ని సుస్థిరం చేసుకో గలిగావ్! మెనీ మెనీ కంగ్రాచ్యులేషన్స్!" అంటూ ఉష మరోసారి వానిటీ బాగ్ తెరచి లోపలికి కొన్ని క్షణాలు చూసి— ప్లాట్‌ఫాం మీద జనాల్ని పరిశీలనగా చూడసాగింది.

పదేపదే అలా వానిటీబాగ్ తెరవడం —అందులోకి చూడ్డం ప్లాట్‌ఫాం మీద మనుషులవేపు నిశితంగా ఉష చూడ్డంలోని అంతర్యం — అర్థం ప్రభాకర్‌కి అంతుబట్టలేదు.

ఉష వద్దంటున్నా వినిపించుకోకుండా పక్కనున్న టీ స్టాల్లోంచి బిస్కట్లు — కేకులు తెచ్చి ఉషకి అందించాడు ప్రభాకర్.

ఆ తర్వాత వేడి వేడి నెస్ కాఫీ కూడా. బలవంతం చేయడంతో ఉష కాదనలేక పోయింది— ఆ మర్యాదని.

ప్రభాకర్, ఉషల పరిచయాలు, హాస్యాయుణంతో ఒక ముప్పై నిముషాలు కొన్ని క్షణాల్లా ముందుకి జరిగిపోయాయ్.

"ప్రభా! ఈ వూళ్ళో ఎక్కడుంటున్నావ్? ఎప్పుడైనా వీలున్నప్పుడు నిన్ను — మీ వాళ్ళను చూడ్డానికి మేం తప్పకుండా వస్తాం."

"ఓ యస్! తప్పకుండా" అంటూ ఒక కాగితం మీద గబగబా తన అడ్రసు బరికేసి ఉషకిచ్చాడు ప్రభాకర్.

అడ్రసు కాగితం తీసుకుని బేగ్‌లో దాచుకుంది తను.

"ఇంతకీ ఎప్పుడొస్తావ్? మా ఇంటికి!"

"మహారాణి పేటలోనే కదా నీ వుంటున్నది! మేం ఉండేది డాబా గార్డెన్స్‌లో కాబట్టే ఎప్పుడైనా టవున్‌లోకి బజారు పని మీద వచ్చినప్పుడలా వస్తాంలే!"

"వస్తాంలే కాదు. ఫలానప్పుడు వస్తాను— అంటే ఇంటి దగ్గర ఉండటానికి వీలుంటుంది కదా?"

"అవునవును. నీ ఉండకపోతే ఎలా? ప్రస్తుతం మా వారు వూళ్ళో లేరు. ఎల్లుండి సాయంత్రం సరిగ్గా ఆరు గంటలకి నే నొక్కర్తెనే మీ ఇంటికి వస్తాను. సరేనా?"

"అలా అన్నావ్ బాగుంది" తన భార్య పుట్టింట్లో ఉండటం వల్లా, ప్రస్తుతం తనొక్కడే ఇంట్లో ఉండటం వల్లా సంతోషంతో మెలికలు తిరిగి పోతూ అన్నాడు ప్రభాకర్.

"మళ్ళీ కలుద్దాం!" అంటూ ఉష సమాధానం కోసంకూడా ఎదురు చూడకుండా లేచి వెళ్ళిపోయింది.

అంత ఆకస్మాత్తుగా ఉష వెళ్ళిపోతుందని వూహా మాత్రంగానైనా అనుకోని ప్రభాకర్ ముఖంలో ఆశ్చర్యంతో కూడిన ప్రశ్నార్థకం చోటు చేసుకుంది. ఉష కనిపించేదాకా చూస్తూ ఆతరవాత ప్రభాకర్ కూడా వెళ్ళిపోయాడు— అక్కడనుంచి.



చిత్రం ఎస్. పద్మ

* * *

ఉష వస్తానని చెప్పిన రోజు రానే వచ్చింది.

పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్న తహతహతో • ప్రిపేరయ్యే విద్యార్థిలా ఉదయం నుంచీ ప్రభాకర్ ఇంటి అలంకరణలో పడ్డాడు.

శ్రీమతి లేకపోవడం వల్ల—మూడు రకాల స్వీట్లు, రెండు రకాల హాట్లు బెస్ట్ హోటల్ నుంచి రప్పించి సిద్ధంగా ఉంచాడు. బోర్నవిటా కలిపివ్వడానికి పాలొకవేళ విరిగిపోతే— పాలగుండ రెడీగ ఉంచాడు.

కళ్ళు కాయలు కాచేలా ఉదయం నుంచీ గోడ గడియారం వేపే చూపుల్ని నిలిపిన ప్రభాకర్ని గడియారం కరుణించి ఆరుసార్లు తన గుండె బాదుకుంది.

ఆరయ్యే సరికి ప్రభాకర్ మనస్సు ఆనందంతో నిండిపోయింది. మరింత శ్రద్ధగా— దీక్షగా రోడ్డు మీద వచ్చేపోయే వాహనాల్ని తిలకించసాగాడు.

ఆరున్నరైంది. ఏడైంది. ఎనిమిది—తొమ్మిదైనా ఉష జాడలేదు. అయినా ఆశ చావక పది దాకా అలానే వేచి చూశాడ తను. ఊహూ—అయినా ఉష ప్రత్యక్షం కాలేదు. ఇంత రాత్రప్పుడు ఇక తనేం వస్తుంది? నిరాశగా నిట్టూర్చి—ఆ స్వీట్లు, హాట్లు తనే ఆరగించాడు ప్రభాకర్.

* * *

ఆ మర్నాడు— ఆ తరవాత ఆ వారంలో ఎప్పుడో ఒకప్పుడు తప్పకుండా వస్తుంది ఉష అనుకున్న ప్రభాకర్ ఆశ—ఆశగానే మిగిలిపోయింది. ఉష కనిపిస్తుందన్న ఆశతో డాబాగార్డెన్ వీధులన్నీ కనీసం ఒక పది సార్లయినా సర్వేచేసిన ప్రభాకర్‌కి ఒక రెండుసార్లు కనిపించడం—మాట్లాడాలని ప్రభాకర్ ప్రయత్నించడం—అందుకు అవకాశ మీయకుండా ఉష మరి కొంత మంది ఆడవాళ్ళతో కలిసి వెళ్ళిపోవడం జరిగింది.

ఆ తరవాత మూడు రోజులకి ఉష నుంచి ప్రభాకర్‌కి ఒక ఉత్తరం వచ్చింది. ఆత్రంగా విప్పి చదివాడుసాగాడు.

"ప్లాట్‌ఫాం మిత్రులు ప్రభాకర్‌గార్కి నమస్కారాలు. మీరు మా డాబాగార్డెన్ రోడ్లు ఎన్నిసార్లు సర్వే చేశారో, ఎన్నిసార్లు నాతో మాట్లాడాలని ప్రయత్నించారో—నాకు తెలియందేమీ కాదు. చెప్పుల ఖరలు అసలే మండిపోతుంటే ఎందుకండీ?— అలా చెప్పు లరగ దీసుకుంటున్నారు?

ఫలానా రోజున వస్తానని చెప్పి రాలేనందుకు మన్నించమని అడగను. ఫలానా రోజు తప్పకుండ వస్తానని అనుకుంటే మీరు చెప్పుల్లో కాలేసినట్లే ఎందుకంటారా? అసలు మీ ఇంటికి రావాలని ఇప్పటికీ నే ననుకోవటం లేదు. ఇక మీదట అనుకోను కూడా.

మీకు తెలియందేముంది? నా కలం బలంతో ఏదో పొడి చేస్తాం అన్న గర్వం, దీమా గల మీకు నా గురించి అసలేమీ తెలియక పోవడం నిజంగా శోచనీయం.

అన్నట్టు మీ రీ మధ్య శ్రీమతిని కలిశారా? ఉషేమైనా కనిపించిందా? ఏమిటలా ఆశ్చర్యపోతున్నారు? నిజంగానే నండీ. నిజంగా మీ రెవరో నాకు తెలీదు. నేను ఉషని కానప్పుడు మీ శ్రీమతి వగైరా వగైరా అంతా నా కేం తెలుస్తుంది చెప్పండి? మిమ్మల్ని తెలియకుండా మిమ్మల్ని 'ప్రభా' అని ఎంతో తెలిసినట్టు, ఎంతో పరిచయ మున్నట్లు ఎలా పిలువ గలిగాను అని కదూ మీ అనుమానం?

ఆ రోజు మీరు నా పక్క కూర్చున్నారు. మీ హేండ్‌బాగ్‌కి ఉన్న ప్లాస్టిక్ లేబుల్లో అందంగా, కుదురుగా రాసి ఉన్న మీ పేరు, మీ బాంకు పేరు నా కనిపించింది. ఆ రోజు ప్లాట్ ఫారం మీద జనం చాలా మంది కళ్ళకి మిరుమిట్లు గొల్పాయని, ఎంతో మందికి నా నగల మీదే దృష్టి పడిందని వారి వారి చూపుల ద్వారా గ్రహించ గలిగాను. వారి దృష్టిలోంచి తప్పుకోడానికి వీలు పడింది కాదు నాకు. నా దృష్టి లోపడాలని నాతో మాట్లాడాలని మీరు ప్రయత్నించడం, ఆ తరవాత నా పక్కనే పేపరు చూస్తున్నట్లు నటిస్తూ నా పక్కన కూర్చోడం... అన్నీ నేను గమనించక పోలేదు.

నా పెన్ ఫ్రెండ్ '...మూర్తి' గార్ని రిసీవ్ చేసుకోవడానికి ఆ రోజు స్టేషన్‌కి వచ్చాను. వారిని నేను కాని, నన్ను వారు కాని ఎప్పుడూ చూసుకోవడం పడలేదు. అందుకే అప్పుడప్పుడు నా వానిటి బాగ్‌లో ఉన్న వారి ఫోటోని చూస్తూ ప్లాట్‌ఫారమ్ మీద జనాన్ని నిశితంగా చూడ్డం చేశాను.

ఈ నా చర్య మీలో ఆలోచనల అలజడిని రేపి ఉంటుంది. మీరే ఎన్నో విషయాలు చెప్పారు. మీరెన్నో అడిగారు. సందర్భానికి తగ్గట్టుగా నా సంభాషణ మీ ప్రశ్నలకి సరిగ్గా సరిపోయింది.

నిజంగా అంతేనండీ. రచయిత మహాశయా. ఆ రోజు నాకు మంచి కంపెనీ ఇచ్చినందుకు చాలా థాంక్స్. ముఖ్యంగా మీ కంపెనీ మూలంగా ప్లాట్‌ఫారమ్ జనాల దృష్టి అప్రయత్నంగా నా మీద నుంచి తప్పిపోయింది. అందుక్కూడా థాంక్స్. లేకుంటే ఇంకెంత బోర్ ఫీలయ్యే దాన్నో కదా?

ప్లాట్ ఫారమ్ మిత్రమా మరిక సెలవా? చివరగా ఒక విషయం. కథకి మేటర్ దొరికిందని మన కలయిక ఆధారంగా కథ మాత్రం రాయమ సుమా. ఎందుకంటారా? వచ్చే నెలలో రానున్న ఒక పత్రికకు మన కథ నే నిప్పుడే రాసి వారికి పంపించేశాను.

మరిక నిజంగానే సెలవు తీసుకుంటున్నాను.

— ఉష."

ఉత్తరం చదివిన ప్రభాకర్ వదనారవిందం ఎలా ఉంటుందో మీరే వూహించుకోండి. *